AKSHARA TODAY
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
16-3-2026 (Monday) MAIN EDITION

## డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ భీకరదాడులు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. ఇరాన్‌లోని ఖార్గ్ ద్వీపంపై అమెరికా దాడులు చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పెద్ద ఎత్తున దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై భారీగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. దీంతో ఆ ప్రాంతం అట్టుడుకుతోంది. పశ్చిమాసియా యుద్ధంలో మొదటిసారి సెజ్జిల్‌ను ఇరాన్ ప్రయోగించింది. అలాగే దుబాయ్, బాగ్దాద్ ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా డ్రోన్, మిస్సైల్ దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌ను సైతం లక్ష్యంగా చేసుకుంది.

## కొనసాగుతున్న గ్యాస్ కష్టాలు




**అక్షరటుడే, హైదరాబాద్:** గ్యాస్ కష్టాలు కొనసాగుతున్నాయి. వాణిజ్య సిలిండర్ల కొరతతో హాస్టళ్లు, హోటళ్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పలు హోటళ్లు మూత పడుతున్నాయి. హైదరాబాద్‌లోని అనేక ప్రైవేట్ హాస్టళ్లలో సైతం గ్యాస్ సరఫరా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హోటళ్లు, హాస్టళ్లలో కట్టెల పొయ్యి వంట చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్లు మూసివేయాల్సిన పరిస్థితి ఉంటుందని నిర్వాహకులు వాపోతున్నారు. కాగా నగరంలో వేలాది హాస్టళ్లు ఉండగా.. విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారు, కోచింగ్ తీసుకునే వారు లక్షల్లో ఉంటారు. గ్యాస్ కొరతతో వారిపై ప్రభావం పడుతోంది.

## పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



అక్షరటుడే, అమరావతి: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో రాష్ట్రాన్ని సాధించి పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుకుంటుందని పేర్కొన్నారు. అమరావతి పరిధిలో 58 అడుగుల పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## బెంగాల్‌లో ఈసీ కీలక బదిలీలు




అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గంటల వ్యవధిలోనే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆ రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రెటరీ సహా నలుగురు కీలక వ్యక్తులపై ఈసీ వేటు వేసింది. ఆయా పదవుల్లో కొత్తవారిని నియమించాలని ఆదేశిస్తూ బెంగాల్ ప్రభుత్వానికి లేఖ పంపింది.

## దిగొచ్చిన బంగారం, వెండి ధరలు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు బంగారం, వెండి ధరల పై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. దీంతో ఇప్పటికిప్పుడు అమెరికా ఫెడ్ సహా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు ఏర్పడ్డాయి.



## నేడు గుజరాత్ తీరానికి శివాలిక్ నౌక

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు గ్యాస్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసి వేయడంతో అనేక నౌకలు అక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వంతో ఇరాన్‌తో చర్చలు జరిపింది. దీంతో భారత నౌకలకు ఇరాన్ అనుమతిస్తోంది. దీంతో ఇప్పటికే పలు చమురు, గ్యాస్ నౌకలు భారత్‌కు చేరుకోగా.. నేడు శివాలిక్ ట్యాంకర్ షిప్ గుజరాత్ తీరానికి రానుంది. దీంతో దేశంలో గ్యాస్ కష్టాలు కొంత మేర తీరనున్నాయి. హార్ముజ్ జలసంధిని దాటిన ఎల్‌పీజీ ట్యాంకర్ శివాలిక్ సోమవారం గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు చేరుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. శివాలిక్, నందా దేవి నౌకలు మార్చి 16, 17 తేదీల్లో వస్తాయని తెలిపారు.



## దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో డ్రోన్ దాడి..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో డ్రోన్ దాడి జరిగింది. దీంతో తాత్కాలికంగా విమాన సర్వీసులు రద్దు చేశారు. డ్రోన్ దాడితో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అధికారులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతో విమాన సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రయాణీకులు, సిబ్బంది భద్రత కోసం విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో కొన్ని విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. ప్రయాణికులు విమానాశ్రయానికి రావొద్దని ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ కోరింది.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



**తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ పురోగతిలో ప్రతిపౌరుడు భాగస్వామి అన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని తెలిపారు. ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ మారుతుందని పేర్కొన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నామని వెల్లడించారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

**■ అన్ని వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ ■ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ■ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం**

అందరి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

### హిల్ట్ పాలసీతో..

తెలంగాణను సైతం కోర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా వర్గీకరించినట్లు తెలిపారు. హిల్ట్ పాలసీతో పరిశ్రమలకు భూములు బదలాయిస్తామన్నారు. అలాగే మూసీ సుందరీకరణ చేపడుతామన్నారు. మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ అభివృద్ధి చేస్తామని తెలిపారు. మూసీ నదిలో మురుగు నీరు చేరకుండా 39 ఎస్‌టీపీలు నిర్మిస్తామన్నారు. హైడ్రా ద్వారా 1,045 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. కొడంగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారనుందని చెప్పారు. గవర్నర్ గంట పాటు ప్రసంగించారు. అనంతరం స్పీకర్ ఉభయ సభలను వాయిదా వేశారు.

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

### ఎంఐఎం వాకౌట్

అసెంబ్లీ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సమావేశాల ప్రారంభం సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దీనిపై నిరసన తెలుపుతూ సభ నుంచి ఎంఐఎం సభ్యులు వాకౌట్ చేశారు.

## కాంగ్రెస్‌కు రాజీనామా చేయనున్న జీవన్‌రెడ్డి..



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయనున్నారు. త్వరలో పార్టీని వీడనున్నట్లు ఆయన ప్రకటించారు. ఉగాది, రంజాన్ అనంతరం తన అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నారు. ఆయన 1983లో తొలిసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి గెలిచి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. 1985లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన జీవన్‌రెడ్డి 1989లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొత్తం ఆరుసార్లు జగిత్యాల నుంచి విజయం సాధించారు. ఎన్టీఆర్, నాదెండ్ల భాస్కర్‌రావు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గాల్లో పని చేశారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌కు సేవలు అందించిన జీవన్‌రెడ్డి కొంతకాలంగా ఆ పార్టీలో ఇమడలేకపోతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సైతం పార్టీని అట్టిపెట్టుకొని ఉన్న ఆయన.. కాంగ్రెస్ గెలిచాక వీడాలని నిర్ణయించుకోవడం గమనార్హం. కాగా.. ఆయన బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది.

## శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. తెలంగాణను ఒక ఏటీఎం లాగా మార్చి ఏఐసీసీ పెద్దలకు సమర్పించుకునే శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రజల మీద లేదని ఆరోపించారు. శాసనసభలో, శాసనమండలిలో తప్పకుండా ప్రతి పేదవాడి తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

## రాష్ట్రానికి వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఉపరిత ఆవర్తన ద్రోణి ప్రభావంతో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో వర్షాలు పడుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొన్నటి వరకు ఎండలు మండాయి. అయితే ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం నుంచి పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విరిగిపోగా.. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడింది.

## ఓటీఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసువాలి: ఆర్‌వీ కర్ణన్

**అక్షరటుడే, హైదరాబాద్:** ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీతో పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. మార్చి 31 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఓటీఎస్ స్కీమ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 28 లక్షల ఆస్తి పన్నుదారుల్లో 18 లక్షల మంది చెల్లించారని పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు రూ.2,186 కోట్ల పన్ను వసూలు అయ్యిందని చెప్పారు.

## బీఎండబ్ల్యూ కారు బీభత్సం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఓ బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు టైర్ ఊడిపోయింది. ఫిలిం నగర్‌లో సోమవారం ఉదయం అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పింది. అనంతరం డివైడర్‌ను ఢీకొంది. కారు ముందుటైర్ ఊడిపోయిందంటే ఎంత వేగంగా వెళ్తుందో అర్థం చేసుకోవచ్చు. అయితే కారులో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. కారు ముందు భాగం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డుపై ఉన్న కారును పక్కకు తొలగించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు.

## కీర్తి సురేష్ కొత్త మూవీ రిలీజ్ డేట్ ఫిక్స్..




**టాలీవుడ్ మహానటి కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉంది. వరుస పరాజయాలు వెంటాడుతున్న వేళ.. ఈ మలయాళ బామ బాలీవుడ్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. రాజ్‌కుమార్ రావు హీరోగా నటిస్తున్న 'రఫ్తార్' మూవీతో హిందీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. జూలై 24న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మరి ఈ సినిమాతోనైనా కీర్తి మళ్లీ సక్సెస్ బాట పడుతుందా..? బాలీవుడ్‌లో గట్టి పునాది వేసుకుంటుందా? అన్నది ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చగా మారింది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**